క్రీడాప్రాంగణాలు.. నిరుపయోగం

● గ్రామ పంచాయతీల్లో సామగ్రి
● అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



క్రీడాప్రాంగణంలో రైతులు ఆరబోసిన ధాన్యం రాశులు

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను నిర్మింపజేసిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ నిధులతో ప్రాంగణాలు ఏర్పాటు చేయించింది. పంచాయతీల ద్వారానే క్రీడాసామగ్రి కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలు లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉంటున్నాయి.

మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వం క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఒక్కో పంచాయతీలో స్థలాన్ని బట్టి పంచాయతీల నుంచి నిధులు వెచ్చించి ప్రాంగణాల నిర్మించారు. ప్రాంగణంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, తదితర క్రీడలతోపాటు జిమ్ సౌకర్యాలు కల్పించారు. క్రికెట్ కిట్‌లను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. క్రీడాప్రాంగణాల్లో తాగునీటి, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఆ వైపు కన్నెత్తి చూడని దుస్థితి నెలకొంది. గ్రామీణ యువతను సమీకరించి క్రీడాంశాల్లో శిక్షణ ఇప్పించడంతోపాటు ఆటల పోటీలు నిర్వహించాల్సిన బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం విస్మరించిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ, క్రీడాపోటీల నిర్వహణ బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకున్న దాఖలాల్లేవు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సైతం క్రీడాకారులను ప్రోత్సహించేలా కార్యాచరణ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. అయినా అధికారులెవరూ ఆ వైపు చొరవ తీసుకున్న దాఖలాల్లేవు. పోలీసు శాఖ యువతకు కొంత అవగాహన కల్పిస్తూ క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని, అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడంలో పోలీసు శాఖకు యువత సహకరించాలని, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించింది. ప్రభుత్వం క్రీడల నిర్వహణకు పంచాయతీలకు నిధులు కేటాయించడం లేదు. ఈ క్రమంలో అసౌకర్యాల నడుమ క్రీడాప్రాంగణాలు కునారిల్లుతున్నాయి. వృథాగా ఉంటుండడంతో పలు క్రీడాప్రాంగణాల్లో రైతులు ధాన్యం ఆరబోసుకున్నారు. కల్లాలుగా వినియోగిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యువతను సమీకరించి క్రీడాపోటీల్లో శిక్షణ ఇప్పించడం, పోటీలు నిర్వహించడం, క్రీడాసామగ్రి రక్షణకు బాధ్యులను నిర్ణయించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



క్రీడాప్రాంగణాల నిర్వహణ, ఇతర కార్యక్రమాల కోసం నిధులు కేటాయించాలి. అలాగే క్రీడాప్రాంగణాల్లో తాగునీటి, ఇతర వసతులు కల్పించాలి. పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలి. గ్రామ పంచాయతీల్లో ఉన్న క్రీడాసామగ్రిని యువజన సంఘాలకు అప్పగించి పోటీల, శిక్షణ నిర్వహణకు బాధ్యులుగా అధికారులను ప్రకటించాలి.

- ఆబోతు అశోక్, గ్రామస్తుడు, మనుబోతులగడ్డ

యువత వినియోగించుకోవాలి



క్రీడాప్రాంగణాలను యువత వినియోగించుకోవాలి. అన్ని గ్రామాల్లోనూ క్రీడాప్రాంగణాలున్నాయి. గతంలో ఈజీఎస్, జీపీల ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిగాయి. గ్రామపంచాయతీల నిధులను వినియోగించారు. పంచాయతీల్లో క్రీడాసామగ్రి అందుబాటులో ఉంది. నిధుల కేటాయింపులు లేవు. వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తాం.

-అంబటి సునీల్‌కుమార్, ఎంపీడీఓ, ఖానాపురం

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● సీపీఎం రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నర్సంపేట : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి రంగారెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బస్తాకు రెండు కేజీల చొప్పున తరుగు తీయాల్సి ఉండగా మిల్లర్లు తరుగు, తాలు పేరుతో క్వింటాకు 8 కేజీలు తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు రైతులు కిరాయి వాహనాల ద్వారా ధాన్యం చేరవేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అకాల వర్షాలతో కల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులకు సరిపడా టార్పాలిన్ పర్దాలు అందించాలని, దొడ్డు ధాన్యం పండించిన రైతులకు కూడా బోనస్ చెల్లించాలని, వర్షానికి తడిచిన ధాన్యాన్ని సైతం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్టీ జిల్లా కార్యదర్శి రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, ముంజాల సాయిలు, నాయకులు అక్కపెల్లి సుధాకర్, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, దాసరి నరేశ్, నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమే జేవీవీ ధ్యేయం

● ఎంఈఓ సారయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

నర్సంపేట : సమాజ హితమే జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ధ్యేయమని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కొర్ర సారయ్య తెలిపారు. పట్టణంలోని భవాని మహిళా పరస్పర సహకారా సంఘం వార్షిక సభలో 'ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలపై చైతన్యం, కూల్‌డ్రింక్స్ వల్ల కలిగే అనర్థాలు' పై వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి సారయ్య హాజరై మాట్లాడారు. చైతన్యం కలిగిన మహిళ తనతోపాటు కుటుంబాన్ని, సమాజాన్ని ఉన్నతి దిశగా నడిపించగలదని చెప్పారు. మహిళలు తల్చుకుంటే దేన్నైనా సాధించగలరని తెలిపారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని చెప్పారు. సమాజ చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటోందని తెలిపారు. వేదిక గౌరవ అధ్యక్షుడు పెండెం భాస్కర్ మాట్లాడుతూ మహిళలు, మహిళా సంఘాల పొదుపుతో రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు. మూఢాచారాలు, మూఢనమ్మకాలు లేని సమాజ నిర్మాణానికి మహిళలు పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేదిక మండల ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్‌కుమార్, లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనివాస్, డ్రాయింగ్ మాస్టర్ కిష్టయ్య, ఉపాధ్యాయులు గోపాల్, సురేశ్, అధ్యక్షురాలు పోగు రమ, తౌటి విజయ, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మోత్సవాలు



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలోని వేణుగోపాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం వార్షిక కల్యాణం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నదాన దాత దొడ్డ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి..



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రేపటి (ఈనెల 14) నుంచి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ బాధ్యులు మహలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, ల్యాదినేని ఎల్లయ్య, గిరగాని నర్సయ్య, బిక్కి మురళీ కీలకపాత్ర పోషించనున్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఆలయం ఎదుట కొత్తగా నిర్మించిన ఆర్చిని ప్రారంభిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పలువురు భక్తులు ఆలయ కమిటీ బాధ్యులకు విరాళాలను అందజేస్తున్నారు. పల్లకి సేవ, శేష వాహన సేవ, కల్యాణం, ఎదుర్కోళ్లు, అన్నదానం నిర్వహించనున్నారు.

లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

రాయపర్తి : మండలంలోని పోతిరెడ్డిపల్లిలోని గుట్టపై సోమవారం రాత్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ పూజారులు గట్టు నర్సింహాచార్యులు, రంగాచార్యులు, నవీన్ ఆచార్యుల ఆధ్వర్యంలో పంచరాత్ర ఆగమన శాస్త్రం ప్రకారం కొండం వంశస్తుల సమక్షంలో కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కొండం నీరజ భాస్కర్‌రెడ్డి దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, కిష్టాపురం, వాంకుడోతుతండా తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ మహాయాగం

నర్సంపేట : పట్టణ పరిధిలోని సర్వాపురంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ మహాయాగం సోమవారం వేడుకగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, తదితర ప్రముఖులు వేర్వేరుగా హాజరై మహాయాగంలో భాగస్వాములై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఉన్నతికి ఆంజనేయస్వామిని వేడుకున్నట్టు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు



దుగ్గొండి : మండలంలోని చలపర్తిలోబేతేనియా బాప్టిస్టు చర్చిలో విద్యార్థులకు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అలరించారు. పాటల, నృత్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు రెవరెండ్ డాక్టర్ వినయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎంఎస్.రాజు, జన్ను జీవిత, రజిత, అఖిల, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని శాయంపేట గ్రామ పరిధిలోని స్టేషన్ చింతలపల్లికి చెందిన కిష్టాపురం గౌతమ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి లక్ష్మీ గణపతి పరపతి సంఘం సభ్యులు సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత గౌతమ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఊరుగొండ మురళీ, గాలి మహేశ్, శ్రీనివాస్, కృష్ణ, అన్వేశ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

ఐనవోలు : ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా.. పంథిని శివారులో ఈనెల 9న కుడా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లగా మేరుగు రమేశ్ అధికారులతో ఘర్షణ పడి సర్వేయర్ సూరజ్‌ను దూషించి బెదిరించాడు. సూరజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



వర్ధన్నపేట : అభివాదం చేస్తున్న నాయకులు



నర్సంపేట:వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

● కార్మిక సంఘాల నాయకులు రమేశ్, కుమారస్వామి, వెంకటయ్య

వర్ధన్నపేట : ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ముక్కెర కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య కోరారు. పట్టణంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సుమారు వందేళ్ల క్రితం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చి కార్మికుల బతుకులు బుగ్గిపాలు చేసేలా 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగిస్తోందని చెప్పారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, గుమాస్తా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తుమ్మల సాంబయ్య, ఆరెల్లి రవి, తుమ్మల విజయ్‌కుమార్, బాబు, లక్ష్మణ్, పద్మ, ఎం శ్రీను, రవి, బిక్షపతి, కృష్ణ, కుమారస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ చెన్నారావుపేట మండల కన్వీనర్ జన్ను రమేశ్ కోరారు. చెన్నారావుపేటలో సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. సమ్మెలో కార్మికులు, వ్యవసాయ కూలీలు, అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి అబ్బదాసి అశోక్, నాయకులు దూడయ్య, రాజు, రవి, తిరుపతి, సాయిచంద్, పాషా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి గ్రామంలోని శ్రీచైతన్య విద్యాలయంలో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 2 దశాబ్దాల తర్వాత ఒకరినొకరు తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఆనందంలో మునిగితేలారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, బొనగాని రవీందర్, కొమురయ్య, రఘోత్తంరెడ్డి, సుఖజీవన్‌రెడ్డిలను ఆహ్వానించి ఘనంగా శాలువాలతో సత్కరించారు. స్నేహహస్తం కొనసాగించాలని, సామాజిక సేవలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు భరత్, సుమన్, విజయ్, చాంద్‌పాషా, సుమలత, లావణ్య, స్రవంతి, రాజ్‌కుమార్, ప్రదీప్, కృష్ణాకర్, కుమారస్వామి, నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ శివారు రామ లింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై గల డివైడర్ మూయొద్దని సోమవారం కటాక్షపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి డివైడర్ మూయొద్దని సూచించారు. గ్రామస్తులు కుడుతాల రమేశ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్'ను వినియోగించుకోండి

తొర్రూరు: డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దోస్త్ ప్రక్రియను వినియోగించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాములు కోరారు. పట్టణంలోని ఆ కళాశాలలో సోమవారం దోస్త్ ప్రవేశాల వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈనెల 21 వరకు ఆన్‌లైన్ నమోదుకు అవకాశం ఉందన్నారు. కళాశాలలో నమోదు అవకాశం కల్పించామన్నారు. ఇతర వివరాలకు 90597 62412, 98485 29152 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

నివాళి

రాయపర్తి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పీఏ కొలనుపాక పరమేశ్ తండ్రి సిద్దులు మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నివాళులర్పించారు. తొలుత శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని వర్ధకొండలోని సిద్దులు నివాసానికి చేరుకుని పరమేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నాయకులు అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, కొమ్ము రాజు, కోల సంపత్, యూసుఫ్, సాయి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఐక్యత కీలకం



నినాదాలు చేస్తున్న దేవేందర్, నాయకులు

● మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్

నల్లబెల్లి : ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలంటే రాజకీయాలకు అతీతంగా ఐక్యత సాధించడమే కీలకమని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో వెనుకబడ ఉన్నారని చెప్పారు. ముదిరాజ్ కులస్తులు, ముఖ్యంగా యువత అవగాహన పెంచుకుని చైతన్యవంతులై ఉన్నత స్థాయికి చేరుకునే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా గోనెల నరహరి, అధ్యక్షుడిగా గూబ రాజు, ప్రధాన కార్యదర్శిగా నీలం సుధాకర్, ఉపాధ్యక్షులుగా పెండ్యాల శ్రీనివాస్, బిజ్జ ధర్మారావు, అల్లె రజినీకాంత్, కార్యదర్శులుగా సిద్ద సాంబయ్య, పెండ్యాల సుధాకర్, కోశాధికారి నూనె రాజేందర్ తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేసీఆర్, పెద్ది ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కేసీఆర్, పెద్ది ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

నర్సంపేట : మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు చెన్నారావుపేట శివారులోని పాకాల (మున్నేరు వాగు) వద్ద సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ బాల్నె వెంకన్న మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో పాకాల–మున్నేరు వాగులపై రూ.32.78 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాం, హైలెవల్ బ్రిడ్జిలను నాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంజూరు చేయించారని గుర్తు చేశారు. పలు చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచాక చెన్నారావుపేటలో పనులు ప్రారంభించారని చెప్పారు. మిగతా రెండు చోట్ల ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇకనైనా పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, నాయకులు మహ్మద్ అబ్దుల్ గఫార్, కొండవీటి ప్రదీప్‌కుమార్, కందకట్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే అత్యున్నత స్థానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

గూడూరు : చదువుకున్న ప్రతీ ఒక్కరికీ సమాజంలో అత్యున్నత స్థానం లభిస్తుందని గోర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు మంగీలాల్‌నాయక్, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మైస శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో తీగలవేణి జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా, జెడ్పీహెచ్‌ఎస్ సెక్టార్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన బాదావత్ పరమేశ్వరిని సోమవారం గోర్ సభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజ్మీరా బిచ్చానాయక్, జరుపుల వీరన్ననాయక్, అర్జున్ చౌహాన్, బొమ్మగాని కలమసత్యం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మర్రి రక్షితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకురాలు ఝాన్సీరెడ్డి

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. స్థానిక పద్మశాలి మార్కండేయ భవనంలో నియోజకవర్గంలోని కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల్లో పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 143 మంది విద్యార్థులకు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించి నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఫలితాల్లో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా వచ్చే తన వేతనాన్ని అభివృద్ధికే వెచ్చిస్తానన్న హామీలో భాగంగా కంప్యూటర్లను కొనుగోలు చేసామన్నారు. పది రోజుల్లో తొర్రూరులో కంప్యూటర్ సెంటర్ ప్రారంభించి నిష్ణాతులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తన అత్తమామలైన ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అనేక ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ లక్ష్యంతో ముందడుగు వేయాలని కోరారు. వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ విద్య ద్వారానే వికాసం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనగామ డీఈఓ బోజన్న, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతాంగానికి సాగునీటిని అందించేందుకే చెక్‌డ్యాంలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుర్తూరు గ్రామ శివారులోని ఆకేరువాగుపై ఉన్న పాతకాలం నాటి చెక్‌డ్యాంను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే నిధులను మంజూరు చేయించి చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం చర్యలు తీసుకొని పంటల సాగును పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం



నర్సులను సత్కరిస్తున్న వైద్యులు

తొర్రూరు: ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకమని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నర్సులను సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడారు. రోగుల సంరక్షణ, భద్రతను మెరుగుపర్చడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మానవీకరించడంలో నర్సులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్వలిత, వైద్యులు మీరాజ్, ప్రియాంక, మానస, శంకర్, తదితరులు పాల్గొన్నారు.